సాక్షి నిజామాబాద్

మంగళవారం, 22, అక్టోబర్, 2024



అర్హులందరికీ కల్యాణలక్ష్మి

అర్హులందరికీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సకాలంలో అందించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు.

- 8లో ▸



ప్రజావాణికి 82 ఫిర్యాదులు

ప్రజావాణికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.8 /22.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన నుడా చైర్మన్



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) చైర్మన్‌గా కేశ వేణు బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఉదయం నుడా కార్యాలయంలో కేశ వేణు వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. వేణును పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, నాయకులు మధుయాష్కీగౌడ్ అభినందించారు.

వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా గంగాధర్



నిజామాబాద్ సిటీ: తెలంగాణ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌కు చోటు దక్కింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిషన్‌లో చైర్మన్‌తో పాటు ఏడుగురు సభ్యులను నియమించింది. ఇందులో గడుగు గంగాధర్‌కు స్థానం దక్కడంతో పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ-నామ్ సర్వర్‌లో సాంకేతిక లోపం

సుభాష్‌నగర్: వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఆన్‌లైన్‌లో క్రయవిక్రయాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-నామ్ సర్వర్‌లో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పంటల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. మార్కెట్ యార్డుకు సోమవారం పసుపు, సోయా, మొక్కజొన్న, నువ్వులు, తదితర పంటలు కలిపి సుమారు 2వేల బస్తాల వరకు రైతులు తీసుకొచ్చారు. ఈ-నామ్ పనిచేయకపోవడంతో రైతులు పడిగాపులు కాశారు.

జీవన్‌రెడ్డి మాల్‌కు నోటీసులు

ఆర్మూర్: ఆర్మూర్‌లో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన జీవన్‌రెడ్డి మాల్‌కు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ సోమవారం నోటీసులు జారీ చేసింది. సంస్థ యజమాని జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డితో పాటు రుణం తీసుకోవడానికి షూరిటీ ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశారు. ఆర్మూర్ కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకొని జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టిప్లెక్స్ నిర్మాణం కోసం విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ వద్ద రూ.40 కోట్ల రుణం తీసుకున్నారు. వాయిదాలు చెల్లించకపోవడంతో వడ్డీతో కలిపి రూ.45.46 కోట్లకు చేరుకుంది. ఈ బకాయిలను తక్షణమే చెల్లించాలంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. తమ ఆస్తులను షూరిటీగా పెట్టిన కాటిపల్లి గంగారెడ్డి, యాల్ల నరేందర్, నక్కల లక్ష్మణ్‌కు సైతం నోటీసులు జారీ అయ్యాయి. షూరిటీ ఇచ్చిన వ్యక్తుల భూములు స్వాధీనం చేసుకోవడానికి అధికారులు రంగంలోకి దిగారు. సకాలంలో రుణ బకాయిలు చెల్లించకపోవడంతో భూములు స్వాధీనం చేసుకుంటామని వ్యవసాయ భూముల వద్ద ఫ్లకార్డులు పెట్టి, నోటీసులను అతికించారు. ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశమైంది.

విమర్శలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, భూపతిరెడ్డి, జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, మధుయాష్కీ, అనిల్, కేశ వేణు, మానాల

- రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు
- పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్‌ఎస్ విష ప్రచారం చేస్తున్నాయని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వాస్తవాలను ప్రజలకు వివరిస్తూ ఆ విమర్శలను తిప్పి కొట్టాలని సూచించారు. నగరంలో సోమవారం నిర్వహించిన నుడా చైర్మన్ కేశ వేణు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని విమర్శించారు. కాంగ్రెస్‌లో పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ పెద్దలు తప్పక గుర్తిస్తారన్నారు. కేశ వేణుకు నుడా చైర్మన్ పదవి రావడమే అందుకు ఉదాహరణ అన్నారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న వారికి, పార్టీలో ముందునుంచి ఉన్న వారికే ప్రాధాన్యత దక్కుతుందన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చినా కార్యకర్తలు అధైర్య పడవద్దన్నారు. గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ఆర్థికంగా ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు ఎక్కడా ఆగడం లేదని జూపల్లి అన్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ నియంతలా వ్యవహరించడంతోనే ప్రజలు ఆయనను ఇంట్లో కూర్చొబెట్టారన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, మానాల మోహన్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఊర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, వినయ్‌రెడ్డి, గడుగు గంగాధర్, శేఖర్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్ రావు, అరికెల నర్సారెడ్డి, జావీద్ అక్రమ్ పాల్గొన్నారు.

రాబోయే కాలమంతా కాంగ్రెస్‌దే

- యువజన కాంగ్రెస్ ప్రధాన భూమిక పోషించాలి
- ప్రతి పట్టభద్రుని ఓటు నమోదు చేయాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌సత్తా చాటాలి
- పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్‌పార్టీ పేదల పార్టీ, అన్ని వర్గాల వారిని కులమతాలకు అతీతంగా సమ దృష్టితో చూసే పార్టీ అని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ అన్నారు. పార్టీని కాపాడుకునే బాధ్యత యువజన కాంగ్రెస్ సభ్యులదేనని పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బస్వా గార్డెన్‌లో కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యువజన కాంగ్రెస్ ప్రతి కార్యకర్తపైనా ఉందన్నారు. యువతే ప్రధాన భూమిక పోషించాలన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేవలం 30 వేల ఉద్యోగాలిస్తే పది నెలల కాంగ్రెస్ పాలనలో 60 వేలకు పైగా ఉద్యోగాలిచ్చిన ఘనత రేవంత్ సర్కారుదేనన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాల అమలుకు లోటులేకుండా చూస్తున్నామన్నారు. విద్య, వైద్యం, క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామన్నారు. గ్రూప్-1 పరీక్షల్లో ఎట్టి పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరగబోదన్నారు. విపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కుల, మతాలకు అతీతంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. బీజేపీ మత రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. మతం పేరుతో యువత తమ అమూల్యమైన జీవితం వృథా చేసుకోవద్దన్నారు. పనిచేసే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. యువజన కాంగ్రెస్ అనేది కాంగ్రెస్ కార్యకర్తలను తయారుచేసే పరిశ్రమ వంటిదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఊర్దూ అకాడమీ చైర్మన్, నాయకులు అరికెల నర్సారెడ్డి, వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారం ఎటుంటే అటే..

- ఫ్లెక్సీలు పెడుతూ జై కొడుతున్న కప్పదాటుడు నాయకులు
- ప్రధాన రోడ్లపై ప్రమాదకరంగా ఏర్పాటు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



నగరంలో మలుపు వద్ద ప్రమాదకరంగా ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రజాతీర్పుకు విలువ లేదన్నట్లుగా తయారైంది పరిస్థితి. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఏవిధంగా చేశారో అదే మాదిరి ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తుండడంతో కప్పదాట్లకు అలవాటుపడినవారికి పని సులువు అవుతోంది. అధికార పార్టీలోకి దూకేద్దాం.. ఫ్లెక్సీలు నింపేద్దాం అన్నవిధంగా పరిస్థితిని తయారు చేశారు. పార్టీ మారి వచ్చినవారు అధికార పార్టీ నాయకులను బుట్టలో వేసుకునేందుకే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం 'నుడా' చైర్మన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చూస్తే విస్తుపోవాల్సిందే. నగరంలో ఏవైపు చూసినా ఇబ్బడిముబ్బడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు అందరూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంతకాలం ఆ పార్టీలో ఫ్లెక్సీలతోనే మాయాజాలం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో అదే ఫ్లెక్సీల జాతర పర్వాన్ని కొనసాగిస్తున్నారు.

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు..

ఎన్ని ఫ్లెక్సీలు కడితే జనాల్లో అంత గుర్తింపు, నేతల వద్ద ప్రాధాన్యం దక్కుతుందనే ఆలోచనతో రోడ్లు ఖాళీ లేకుండా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. చివరకు మూలమలుపులు, యూటర్న్‌ల వద్ద వాహనదారులకు ఏమాత్రం మార్గం కనిపించని రీతిలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలు ప్రజాతీర్పుతో సంబంధం లేకుండా ఇదే తీరుతో కప్పదాట్లను ప్రోత్సహించారు. ఉద్యమకారులైన బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అన్యాయం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ నేతలు సైతం అసలుసిసలైన కార్యకర్తలకు పంగనామాలు పెడుతూ బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన బ్యాచ్‌కు అందలం వేస్తున్నారు.

నష్టపోయిన కాంగ్రెస్

పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి పోరాడిన కార్యకర్తల కష్టంతో అధికారంలోకి వచ్చాక, అప్పటివరకు బీఆర్‌ఎస్‌లో ఉండి పెత్తనం చేసిన వాళ్లను ఆహ్వానించిన కాంగ్రెస్ పార్టీ కేవలం కొన్ని రోజుల తేడాతోనే ఎదురుదెబ్బ తిన్నది. బీఆర్‌ఎస్‌లోని వాళ్లను తీసుకోకపోతే బీజేపీలోకి వెళతారని భావించుకుని హడావుడిగా కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. తీరా ఫలితం చూస్తే బీజేపీ భారీ మెజారిటీతో లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుంది. అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను నిర్లక్ష్యం చేసిన ఫలితంగా మూడు నెలల తేడాతోనే భారీ నష్టాన్ని మూటగట్టుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి కాంగ్రెస్ ఎదుర్కొనే అవకాశముందని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.



ప్రాధాన్యం కరువు

క్షేత్రస్థాయిలో బలం లేని, కప్పదాట్లతో వచ్చిన వారితో ఆయా పార్టీలకు ఎలాంటి ప్రయోజనం లేకున్నప్పటికీ అధికారంలోకి వచ్చిన నాయకులు ప్రోత్సహించడంపై విమర్శలు వస్తున్నాయి. మరోవైపు పార్టీ ఏళ్లతరబడి అధికారంలో లేకున్నప్పటికీ అనేక కష్టనష్టాలకు ఓర్చి ఆస్తులు అమ్ముకుని పనిచేసిన నాయకులకు కాంగ్రెస్‌లో ప్రాధాన్యం ఇవ్వడం లేదు. గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నసమయంలో భారీగా సంపాదించుకుని కాంగ్రెస్‌లోకి వచ్చిన వాళ్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆర్థికంగా నష్టపోయి ఇప్పుడు రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు న్యాయం చేస్తారని ఆశతో ఎదురు చూస్తున్నారు. కాగా అధికార పార్టీ నాయకులు ఫ్లెక్సీలు మాత్రమే చూస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



అమరవీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్, డీసీపీలు కోటేశ్వరరావు, బస్వారెడ్డి

- అదనపు కలెక్టర్ అంకిత్

ఖలీల్‌వాడి: పోలీస్ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. అమరులకు అదనపు కలెక్టర్, పోలీసు అధికారులు, సిబ్బంది నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ, సమాజ రక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తారన్నారు. పోలీస్ స్మరించుకోవడం మన బాధ్యతన్నారు. దేశం, రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ నేరస్తులను పట్టుకుంటున్నారని పేర్కొన్నారు. అదనపు డీసీపీ బి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో 1986 నుంచి ఇప్పటి వరకు 19 మంది పోలీసులు ప్రాణాలను కోల్పోయారన్నారు. అమరులైన వారిని ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీలు శ్రీనివాస రావు, రవీందర్‌రెడ్డి, నాగేంద్రచారీ, శనగయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పసిడి పరుగులు



నిజామాబాద్ రూరల్: పసిడి ధర పరుగులు పెడుతోంది. సోమవారం మార్కెట్‌లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.81,200కు చేరింది. దసరా సమయంలో రూ.78 వేలు ఉన్న ధర పది రోజుల వ్యవధిలో భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో శుభకార్యాలకు బంగారం, వెండి కొనాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముందు ముందు పెళ్లిళ్ల సీజన్ ఉండటంతో ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

తెయూ అభివృద్ధికి కృషి

- బోధన, పరిశోధనల్లో బలోపేతం చేయడమే లక్ష్యం
- న్యాక్ గుర్తింపునకు కృషి
- ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తా
- తెయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ యాదగిరి రావు



తెయూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ యాదగిరి రావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీని బోధన, పరిశోధనల్లో బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని వర్సిటీ నూతన వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన పరిపాలనా భవనంలోని తన చాంబర్‌లో తెయూ ఐదవ శాశ్వత వీసీ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ప్రతిష్టాత్మక తెలంగాణ యూనివర్సిటీకి వీసీగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో ప్రస్తుతం ఉన్న వనరులను ఉపయోగించుకుని యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో వర్సిటీకి న్యాక్ గుర్తింపు తీసుకొస్తామని పేర్కొన్నారు. న్యాక్ గుర్తింపు లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. యూనివర్సిటీ ఏర్పాటైన 18 సంవత్సరాల్లో ఇంతవరకు కేవలం ఒకసారి మాత్రమే స్నాతకోత్సవం నిర్వహించారని, త్వరలోనే స్నాతకోత్సవం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వీసీ తెలిపారు.

తెయూ క్యాంపస్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఇప్పటికే మంజూరైన రూసా నిధులతో క్యాంపస్ ఆవరణలో నూతనంగా బాలికల హాస్టల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలను తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ పరిధిలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. వర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా జిల్లా కలెక్టర్‌ను కలిసి చర్చిస్తామని వీసీ తెలిపారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆడిట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ, డీన్స్, హెచ్‌వోడీలు, బీవోఎస్ చైర్మన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు విభాగాల సందర్శన

నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, ఆడిట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్‌తో కలిసి పరిపాలన భవనంలోని వివిధ విభాగాలను సందర్శించారు. పరీక్షల విభాగం, అడ్మిషన్స్ విభాగం, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ విభాగం, ఎన్ఎస్ఎస్ సేవా విభాగం, ప్రజా సంబంధాల విభాగం, ఆడిట్ సెల్ తో పాటు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి, లా కాలేజ్, కంప్యూటర్ సైన్స్ కాలేజ్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ కళాశాలల భవనాలను, సెంట్రల్ లైబ్రరీని సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు అందించారు.

వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావుకు రిజిస్ట్రార్‌తో పాటు పలు విభాగాల బోధన, బోధనేతర సిబ్బంది ఘన స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.వీసీ ని టూటా, కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్, పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్, అఫ్లియేటెడ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, నాన్- టీచింగ్ అసోసియేషన్, ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

జడ్జీల క్వార్టర్ల నిర్మాణానికి శంకుస్థాపన



నిజామాబాద్‌లో జడ్జీల క్వార్టర్లకు శంకుస్థాపన చేస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల తదితరులు



బోధన్‌లో శంకుస్థాపన చేస్తున్న ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్

ఖలీల్‌వాడి/బోధన్: జడ్జీలకు వసతులు కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తులు కాసోజు సురేందర్, లక్ష్మీనారాయణ అలిశెట్టి, వినోద్ కుమార్ అన్నారు. నిజామాబాద్, బోధన్ కోర్టు ప్రాంగణాల్లో జడ్జీల కోసం నిర్మించనున్న క్వార్టర్లకు సోమవారం వారు హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మొదట నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల స్వాగతోపన్యాసం చేశారు. హైకోర్టు జడ్జీలు మాట్లాడుతూ.. కోర్టుల ప్రాంగణాల్లో గృహ సముదాయాల నిర్మాణం మౌలిక వసతుల కల్పనలో ఒకమెట్టుగా అభివర్ణించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో లిఫ్టును ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నిజామాబాద్‌లో అదనపు జిల్లా జడ్జీలు కనకదుర్గ, శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జీలు కుష్బూ, గోపికృష్ణ, చైతన్య, బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, వసంత్‌రావు, రాజు, బోధన్‌లో ఐదో జిల్లా అదనపు న్యాయమూర్తి రవికుమార్, సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్, మేజిస్ట్రేట్లు హరికుమార్, శేష తల్పసాయి, ఏసీపీ శ్రీనివాస్, పీపీ శ్యాంరావు, ప్రభుత్వ న్యాయవాదులు మహ్మద్ గౌసోద్దీన్, బొగ్గుల రవీందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోశెట్టి పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

- జలమయమైన రోడ్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరంలో సోమవారం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 3:30 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఎండ ఉన్నప్పుడే భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రైల్వేస్టేషన్ ప్రాంతంలో ప్రధాన రహదారిపైకి భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని పలు చోట్ల ధాన్యం తడిసిపోయింది.



ఎస్సారెస్పీలోకి పోటెత్తిన వరద నీరు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఆదివారం మధ్యాహ్నం నుంచి వరద నీరు పోటెత్తింది. దీంతో ముందుగా 12 వరద గేట్లను ఎత్తి 37,488 క్యూసెక్కుల నీటిని వదిలారు. రాత్రికి 67,562 క్యూసెక్కుల వరద నీరు పెరగడంతో 17 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 53,108 క్యూసెక్కుల నీటిని వదిలారు. సోమవారం మధ్యాహ్నం వరకు గోదావరిలోకి నీటి విడుదల కొనసాగింది. మధ్యాహ్నం 52 వేల క్యూసెక్కులకు వరద తగ్గుముఖం పట్టడంతో 12 గేట్ల ద్వారా 37,488 క్యూసెక్కులకు నీటి విడుదలను గోదావరిలోకి తగ్గించారు.

260 టీఎంసీల వరద నీరు

ప్రాజెక్ట్‌లోకి ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు 260 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. అత్యధికంగా 157 టీఎంసీల నీరు సెప్టెంబర్ మాసంలోనే వచ్చింది. ప్రాజెక్ట్ నుంచి ఇప్పటి వరకు 187 టీఎంసీల నీటిని అన్ని కాలువలతో పాటు గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 5800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2200 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కుల నీరు పోతుంది.

నిజాంసాగర్‌లోకి 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల సోమవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రధాన కాలువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

క్లుప్తంగా

మాక్లూర్ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



మాక్లూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారి రికార్డులను పరిశీలించారు. డెంగీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్యం వివరాలు తెలుసుకున్నారు. వ్యాధిబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మందుల కొరత ఉందా? అని ప్రశ్నించారు. రక్తపరీక్షలు నిర్వహించే ల్యాబ్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బంది వెంకటేశ్, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



బోధన్‌టౌన్(బోధన్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కీటక జనిత నియంత్రణ అధికారి తుకారాం రాథోడ్ సూచించారు. పట్టణంలోని పలు కాలనీల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి రోగాలబారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. బస్తీ దవాఖాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. డెంగీబారిన పడి చికిత్స పొందుతున్న నాజర్ అనే యువకుడితో మాట్లాడారు. జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చే వారికి రక్తపరీక్షలు చేయాలని, ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఫ్రైడే డ్రైడేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత, వైద్య సిబ్బంది ఉన్నారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేశ్
- పోలీసు అమరులకు ఘన నివాళులు



బెటాలియన్‌లో నివాళులు అర్పిస్తున్న పోలీసు అమరుల కుటుంబ సభ్యులు



నివాళులర్పిస్తున్న బెటాలియన్ పోలీసు సిబ్బంది

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేశ్ అన్నారు. సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బెటాలియన్‌లోని అమర వీరుల స్తూపం వద్ద ఇన్‌చార్జి కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్‌తోపాటు అమరవీరుల కుటుంబాల సభ్యులు, బెటాలియన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలను ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇన్‌చార్జి కమాండెంట్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి పోలీసు తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు. సంఘ విద్రోహులను అరికట్టేందుకు పోలీసులు మరింత కృషి చేయాలన్నారు. ఈ విషయంలో బెటాలియన్ పోలీసుల సేవలు మరువలేనివని, విధినిర్వహణలో ఇప్పటివరకు ఏడో బెటాలియన్‌కు చెందిన 11 మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 1 సెప్టెంబర్ 2023 నుంచి 31 ఆగస్టు 2024 వరకు దేశంలో అమరులైన 214 మంది పోలీసుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం తుపాకులను కిందకు దించి అమరులైన పోలీసులకు రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కేపీ శరకుమార్, కేపీ సత్యనారాయణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ, ఏవో అయ్యవారయ్య, ఆర్‌ఐలు ఎం రాజు, బి శ్యాంరావు, బి వసంత్‌రావు, ఆర్‌ఎస్సైలు, అమర పోలీసుల కుటుంబాల సభ్యులు, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





పోలీసు అమరులకు నివాళులర్పిస్తూ మౌనం పాటిస్తున్న పోలీసులు



నివాళులు అర్పిస్తున్న పోలీసు అమరుల కుటుంబాల సభ్యులు

జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. అమరులకు అదనపు కలెక్టర్, పోలీసు అధికారులు, సిబ్బంది నివాళి అర్పించారు.

అర్హులందరికీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

నిజామాబాద్ సిటీ: అర్హులందరికీ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సకాలంలో అందించాలని జిల్లా ఇన్‌చార్జి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు మంత్రి సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు బాసటగా నిలవాలనే సంకల్పంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి నెల రోజుల్లోనే చెక్కులు అందించేలా చూస్తానన్నారు. అలాగే దరఖాస్తులు తిరస్కరణకు గురైతే కారణాలు చెప్పాలన్నారు. హామీల మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీని అమలు చేయడంతోపాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల రూపాయలకు పెంచామని గుర్తు చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రాజీవ్‌గాంధీ ఆడిటోరియం ఆధునికీకరణకు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రసంగించారు. నిజామాబాద్ నగర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌వద్ద కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్ స్వాగతం పలికారు. మంత్రితోపాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు పి.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలెక్టర్, కమిషనర్ భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు మంత్రి జూపల్లి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 82 ఫిర్యాదులు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు..

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామ పంచాయతీలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన యువకులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో సర్పంచ్ సస్పెండైన క్రమంలో పంచాయతీకి సంబంధించి సుమారు రూ.20 లక్షల వరకు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపించి దుర్వినియయోగమైన నిధులను రికవరీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

మహిళలకు 'ఆర్టీసీ' బహుమతులు



లక్కీ డ్రా తీస్తున్న ఆర్టీసీ అధికారులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లో నూతనంగా ప్రవేశ పెట్టిన డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు బహుమతులు అందజేసినట్లు నిజామాబాద్ డిపో–1 మేనేజర్ ఆనంద్ సోమవారం తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గిఫ్ట్ బాక్స్ నుంచి డ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులను అందజేస్తున్నారు. సెప్టెంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలను విజేతలుగా లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. మొదటి బహుమతి టి వీణారాణి (పెర్కిట్), రెండో బహుమతి నిర్మల (నిజామాబాద్), మూడో బహుమతి సంగ లక్ష్మి (హుజురాబాద్) విజేతలుగా నిలిచినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ నెల1 నుంచి 15 మధ్య కాలంలో నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లో ప్రయాణించిన మహిళల్లో మొదటి బహుమతి జీ లక్ష్మి (జగిత్యాల్), రెండో బహుమతి మంజుల (కరీంనగర్), మూడో బహుమతి విజయలక్ష్మి (నిజాంసాగర్) ఎంపికైనట్లు తెలిపారు. మహిళా ప్రయాణికులు డీలక్స్ బస్సుల్లో నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లో ప్రయాణించి బహుమతులు గెలుపొందాలని అధికారులు కోరారు.

అండర్ - 19 ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 బాలుర విభాగంలో ఉమ్మడి జిల్లా(కామారెడ్డి, నిజామాబాద్) ఫుట్‌బాల్ జిల్లా జట్టును సోమవారం నగరంలోని రాజారాం స్టేడియంలో ఎంపిక చేశారు. పీడీ ప్రసాద్, పీఈటీ అనిల్, అమీర్ కలిసి రాష్ట్రస్థాయికి జిల్లా జట్టును ఎంపిక చేశారు.

ఎంపికైన క్రీడాకారులు..

అనిరుధ్, పాల్, రోనాల్డో, అషేర్, షాదుహుస్సేన్, కిదార్ సిద్ధికి, రయాన్‌అహ్మద్, అఫ్నాన్, నిఖిల్, రాజేశ్, అబ్రార్, హుమేద్, రాజ్‌కుమార్, అనాస్, ఫర్హాన్, సయూస్, అయాన్, జాయిద్ స్టాండ్‌బైలుగా రాహుల్, చందర్, అఖిల్‌నాయక్, జుబేర్ ఎంపికయ్యారు.

నేడు బహిరంగ విచారణ

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ప్రతిపాదనల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఉదయం 10.30 గంటలకు విద్యుత్ టారిఫ్‌పై బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఎస్‌ఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలపై బహిరంగ విచారణ ఉంటుందన్నారు. విచారణకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యుత్ వినియోగదారులు బహిరంగ విచారణకు హాజరు కావాలని ఎస్‌ఈ కోరారు.

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ

రుద్రూర్: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీ తాళం పగులగొట్టి అందులోని డబ్బులు ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడు రాజేశ్వరప్ప పోలీసులకు సమాచారం అందించారు. వారం రోజుల క్రితం మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. పోలీసులు ఆలయాలపై నిఘాసారించి చోరీలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

గోదావరిలో ఒకరి గల్లంతు



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో ఓ వ్యక్తి గల్లంతైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బోధన్‌లోని పోస్టాఫీసు ఏరియాకు చెందిన విభూది మాధవ్ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి నదీ స్నానాలకు వచ్చారని పేర్కొన్నారు. నదిలో స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడని, మాధవ్ భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య



వర్ని: కర్నాటక రాష్ట్రంలోని చిక్లి గ్రామానికి చెందిన మడివాడు సంజీవ్(45) అనే వ్యక్తి మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంజీవ్ టైలరింగ్ చేస్తూ చందూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన సోమవారం మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారం కేసులో ఐదుగురి అరెస్ట్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి ఆటోలో మహిళను తీసుకువెళ్లి డిచ్‌పల్లి ప్రాంతంలో అత్యాచారానికి పాల్పడిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి అంబేడ్కర్ నగర్‌కు చెందిన జైనొద్దీన్ ఖురేషీ, ఘన్‌పూర్ గ్రామంలోని ఇస్లాంపురాకు చెందిన మోసీన్ ఖురేషీ, మిట్టాపల్లికి చెందిన మహ్మద్ సుల్తాన్, నాగేపూర్ గేట్ ప్రాంతానికి చెందిన నగేశ్ చీలంకర్, నడిపల్లికి చెందిన షేక్ రఫీక్ ఈ నెల 18న రాత్రి ఓ మహిళను నిజామాబాద్ బస్టాండ్ నుంచి ఆటోలో తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మొరం టిప్పర్ పట్టివేత

మోపాల్: మండల కేంద్రం నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారనే ఫిర్యాదు మేరకు భూగర్భ గనులశాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌కు జరిమానా విధించనున్నట్లు మైన్స్ అధికారులు తెలిపారు.

మహిళ అదృశ్యం

ఎడపల్లి(బోధన్): మండలంలోని అంబం గ్రామానికి చెందిన నేరడి నర్సవ్వ గతవారం రోజులుగా కనిపించడం లేదని ఆమె కుమార్తె అనిత సోమవారం ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన తల్లి వారం క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని ఆమె ఆచూకీ లభించడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

పెళ్లి చేయడం లేదని తండ్రి హత్య

- సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం
- నవీపేట మండలం అనంతగిరిలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి సోదరి



గౌరు అమృతం (ఫైల్)

నవీపేట: తనకు పెళ్లి చేయడం లేదని, తాను దుబాయిలో ఉన్న సమయంలో పశువులను అమ్మేశాడనే కక్షతో తండ్రిని కొడుకు హత్య చేశాడు. సహజమరణంగా నమ్మించే ప్రయత్నం చేసి దొరికిపోయాడు. నవీపేట మండలం అనంతగిరి గ్రామంలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గౌరు అమృతం(55) కుమారుడు గౌరు మహిపాల్ ఇటీవలే దుబాయి నుంచి గ్రామానికి వచ్చాడు. తల్లి లక్ష్మి గొట్టుముక్కలలో వేరుగా ఉంటోంది. ఏడాది కిందట మహిపాల్‌కు చెందిన పశువులను అమృతం అమ్ముకున్నాడు. తల్లిని వేరుగా ఉంచడం, తనకు పెళ్లి చేయకపోవడం, పశువులు అమ్ముకోవడంతో తండ్రిపై మహిపాల్ కక్ష పెంచుకున్నాడు. అతడిని ఎలాగైనా చంపాలని నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తండ్రీకొడుకులు మద్యం సేవించారు. అమృతం మత్తులోకి జారుకోవడంతో అతడి గొంతుకు మహిపాల్ టవల్ బిగించి హత్య చేశాడు. సోమవారం ఉదయం ఆర్‌ఎంపీని పిలిపించి తన తండ్రి లేవడం లేదని చూపించగా చనిపోయినట్లు అతుడు ధ్రువీకరించాడు. అమృతానిది సహజ మరణంగా చిత్రీకరించిన మహిపాల్ బంధువులకు సమాచారమిచ్చాడు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా అమృతం మెడపై గాయాలను గమనించిన అతడి సోదరి సావిత్రి అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మహిపాల్‌ను విచారించగా తండ్రిని తానే చంపినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

వేర్వేరు కేసుల్లో నలుగురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: న్యూసెన్స్ చేసిన కేసులో నగరంలోని హమాల్‌వాడికి చెందిన సంఘీ రమేశ్‌వర్మకు న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు మూడో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఈనెల 20న రమేశ్‌వర్మ తన తమ్ముడి భార్యతో గొడవపడి రోడ్డుపై న్యూసెన్స్ చేయడంతో అతడిపై 70బీ, 70 సీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి సోమవారం మార్నింగ్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా న్యూసెన్స్ చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

డయల్ 100ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి..

బోధన్‌టౌన్(బోధన్): డయల్ 100ను దుర్వినియోగం చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసిన పట్టణానికి చెందిన శంకర్ అనే వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శేషతల్ప సాయి తీర్పునిచ్చారని సీఐ వెంకటనారాయణ తెలిపారు. నిందితుడిని సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచామన్నారు. డయల్ 100ను దుర్వినియోగం చేయొద్దని ఆయన ప్రజలను కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో..

బోధన్‌టౌన్(బోధన్): మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా, మరో ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శేషతల్ప సాయి సోమవారం తీర్పును వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ ముగ్గురు పట్టుబడగా, వారిని సీఐ వెంకటనారాయణ కోర్టులో హాజరుపర్చారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు.

పేలుడు పదార్థాల కేసులో మూడేళ్లు..

ఖలీల్‌వాడి: ప్రభుత్వ అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు కలిగి ఉన్న కేసులో గండికోట మల్లయ్య అనే వ్యక్తికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తరఫున ప్రాసిక్యూషన్ నిర్వహించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భీమ్‌గల్ పోలీసులు 2014 మే 11న మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ట్రాక్టర్‌లో 200 డిటోనేటర్లు, వైర్లు దొరికాయి. ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించి కామారెడ్డి జిల్లా జంగంపల్లి గ్రామానికి చెందిన గండికోట మల్లయ్యవిగా గుర్తించారు. అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ ముద్దాయిపై పేలుడు పదార్థాలు కలిగి ఉన్న నేరారోపణలు రుజువైనట్లు నిర్ధారిస్తూ గండికోట మల్లయ్యకు మూడేళ్ల కఠిన జైలుశిక్ష విధించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి



రాములు (ఫైల్)

మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని బండ రామేశ్వర్‌పల్లికి చెందిన రైతు నల్లాల రాములు (57) సోమవారం పాముకాటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాములు గ్రామ శివారులోని తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన సమయంలో పాము కాటువేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి..

పిట్లం(జుక్కల్): మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన మద్దెల సాయిలు(42) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 19న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కులస్తుని అంత్యక్రియలు పూర్తయిన తరువాత సాయిలు స్నానం చేసేందుకు చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగిపోయాడు. సోమవారం ఉదయం 7 గంటలకు చెరువులో మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు మృతుడి భార్య పోచవ్వకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్ వద్ద కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ సోమవారం తెలిపారు. గంగస్థాన్ వైపు వెళ్తున్న ఐ20 కారుకు భిక్షాటన చేసే వ్యక్తి ఎదురుగారావడంతో ప్రమాదం జరిగిందని, మృతుడి వయస్సు 60 నుంచి 70 ఏళ్ల ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కోసం 87126 59849 నంబర్‌ను సంప్రదించలన్నారు.

రైలు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు..



విజయ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దర్జీ విజయ్‌కుమార్ (42) సోమవారం కామారెడ్డిలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన విజయ్‌కుమార్ మండలంలోని మత్తమాల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి ఇటీవల ప్రమోషన్‌పై మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేటకు బదిలీ అయ్యారు. అక్కడ విధులను నిర్వర్తిస్తున్న విజయ్‌కుమార్ సోమవారం రైలు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.